జగత్ కిలాడీలు!

అజీజ్

"శివదాస్! వెరీ-గుడ్ న్యూస్!" అంటూ హడావుడిగా గదిలో ప్రవేశించేడు భిక్షుపతి.

గది మధ్య, రౌండ్ టేబుల్ కెదురు బొదురుగా కూర్చుని, రమ్మీ ఆడుకుంటున్న శివదాస్, కాంతినాథ్, కృపానంద్ ఉలిక్కిపడి తలుపువైపు చూసేరు.

"ఎప్పుడూ ఏదో ముంచుకొచ్చినట్టూ, కొంపలంటుకు పోయినట్టూ హడావుడి చెయ్యడంతప్పు, కాస్త నిదానంగా మూవ్ కాలేవూ?" ముఖం చిట్లించేడు శివదాస్.

"నేను చెప్పబోయే న్యూస్ వింటే, మీరూ నాలాగే, నిప్పుతొక్కిన కోతుల్లా భరతనాట్యం ప్రారంభిస్తారు" అంటూ వచ్చి, కుర్చీలో కూలబడ్డాడు భిక్షుపతి.

"చెప్పేది శాస్త్రనూటిగా చెప్పి తగలడు!" అన్నాడు శాంతినాథ్.

అంతవరకూ కలుపుతున్న చీట్లపేకని, కట్టకట్టి టేబిల్ మధ్య గిరాటేసాడు కృపానంద్.

"సేఠ్ చండీరామ్ తెలుసుగా మీకు?" అడిగేడు బిక్షపతి.

"పాండీ బజార్లో ఉన్న జ్యూయలరీ సెంటర్ యజమానేనా?"

"ఆఁ, వాడే! నాకు విశ్వసనీయ వర్గాలద్వారా తెలిసింది. వాడీరాత్రి ఇరవైలక్షలు ఖరీదు చేసే వజ్రాలతో, త్రివేండ్రం వెళ్ళే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం కాబోతున్నాడు."

"ఒంటరిగానా?"

"ఔను!"

"రియల్లీ?"

బిక్షపతి నవ్వేడు గర్వంగా. "నేనింతవరకూ తెచ్చిన ఇన్ఫర్మేషన్ ఏదైనా అబద్ధం అవడం జరిగిందా? నీవు అనుమానప్పాణివి! మడత పేచీలు మాని, తక్షణం ప్లాన్ ఫిక్స్ చెయ్!

రెణ్నెల్లనించీ మన హస్తాలకి పనిలేక జివజివలాడుతున్నాయి. ఆ మధ్య చేసిన బ్యాంకు ఫోర్జరీ తాలూకు డబ్బు అయిపోవస్తోంది. త్వరగా మళ్ళీ ఏదో ఒకటి చెయ్యక తప్పదు మరి!"

"వజ్రాలు ఎందులో పట్టుకెళ్తున్నాడు సేఠ్?"

"ముదురు నీలంరంగు బ్రీఫ్‌కేస్‌లో! ఉదయంనించీ అతనా బ్రీఫ్‌కేస్‌ని క్షణం వదలకుండా, శరీరంలోని అవ

యమంలా అంటిపెట్టుకునే వున్నాడు.

మన దగ్గిర ఆట్టే టైంలేదు. ఇప్పుడే మధ్యాహ్నం మూడవుతోంది. రాత్రి ఎనిమిదిన్నరకి మద్రాసు స్టేషన్ విడుస్తుంది బండి. సేఠ్ ఇంటినించి ఎనిమిది గంటలకల్లా స్టేషన్ చేరుకుంటాడు, శార్లో! అతను ఫస్ట్‌క్లాస్‌లోతప్ప, మరో బోగీలో ప్రయాణం చెయ్యడని మనం గుర్తుంచుకోవాలి!'' అన్నాడు బిక్షుపతి.

పూర్తయిన సిగరెట్ ఏష్‌ట్రేలో నొక్కి, మరో సిగరెట్ అంటించేడు శివదాస్. చురుగ్గా సాగే అతని ఆలోచనలకి అంతరాయం కలిగించకూడదని, మిగతా ముగ్గురూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. సిగరెట్ చివరి దమ్ములాగి ముందుకు వంగేడు శివదాస్. ''బిక్షుపతి సేకరించిన ఈ వివరాలు సరైనవే అయితే నిస్సందేహంగా నా పథకం విజయవంతమౌతుంది.

చెవులు రిక్కరించుకు వినండి. సేఠ్ ఎనిమిదిగంటలకల్లా స్టేషన్ జేరుకోవచ్చు. మనం ఐదునిమిషాలుముందు, స్వల్పమైన సామానుతో, మారువేషాల్లో అక్కడికి చేరాలి.

సేఠ్ ఎక్కిన కంపార్ట్‌మెంట్‌లో, నేనూ, బిక్షుపతి, శాంతినాథ్ తోటిప్రయాణీకుల్లా అతని కేబిన్‌లో ప్రవేశిస్తాం. మనవెంట రెండుమూడు సూట్‌కేసులూ అవీ ఉండటం అవసరం. లేకుంటే సేఠ్‌కు అనుమానం వేస్తుంది.

ట్రేన్ మద్రాసు స్టేషన్ విడిచి, త్రివేంద్రంవైపు సాగేక, ఇరవైమైళ్ళదూరంలో చిన్న బ్రిడ్జి వస్తుంది. కృపానంద్, బండి బైలుదేరకముందే, శార్లో సరిగ్గా ఆ

బ్రిడ్జి దగ్గరకు చేరుకుని చీకట్లో పొంచివుండాలి.

ట్రేన్ ఆ బ్రిడ్జిని సమీపించే సమయానికి, కంప
మెంట్‌లో మనం, సేఠ్ దగ్గర్నుంచి ఆ బ్రీఫ్‌కేస్ క
య్యాలి. చీకట్లో బ్రిడ్జిదగ్గర కాచుకున్న కృపానం
టార్చి వెలిగించి, మనకి సిగ్నల్ ఇస్తాడు. మనం కి
లోంచి బ్రీఫ్‌కేస్‌ని అవతలికి విసిరెయ్యాలి.

"కృపానంద్, దాన్నందుకుని కార్లో తిరిగి, మద్రా
వచ్చేస్తాడు. మనం నెక్స్ట్ స్టేషన్లో బండి దిగి, టాక్సీ
చేసుకురావచ్చు. నే నల్లిన పథకం ఇది! ఇందులో ఎవ్వ
కైనా, ఏమైనా సందేహాలుంటే తీర్చుకోవచ్చు!" అంటూ
ముగించేడు శివదాస్.

"కంపార్ట్‌మెంట్లో, సేఠ్‌నించి ఆ బ్రీఫ్‌కేస్ ఎలా
కాజెయ్యాలో చెప్పావుకావు?" అన్నాడు బిక్షపతి.

"అది అప్పటి పరిస్థితినిబట్టి,క్షణాలమీద నిర్ణయించుకో
వలసిన విషయం! నెక్స్ట్?" అడిగాడు శివదాస్ మిగతా
ఇద్దర్ని చూస్తూ.

"నో డౌట్స్!" అన్నారు ఇద్దరూ ముక్తకంఠంతో.

2

రాత్రి ఎనిమిదిగంటలకి, నలుగురూ తమ పాత అంబా
సిడర్ కార్లో సెంట్రల్ స్టేషన్ చేరుకున్నారు. కారు
పార్కింగ్ ప్లేస్‌లో ఆగగానే, శివదాస్, బిక్షపతి,
కాంతినాథ్ దిగి, అక్కడే పిచ్చాపాటీ మాట్లాడు
కుంటూ నిల్చున్నారు. కృపానంద్ డ్రైవింగ్ సీట్లోనే
ఉండిపోయాడు.

ఎనిమిదిగంటల పదినిమిషాలకి ఓ. షెవర్లెట్ కారు
వచ్చి, పార్కింగ్‌లో ఆగింది. దాన్ని చూడగానే

మోచేత్తో శివదాస్ డొక్కలో పొడిచాడు భిక్షపతి.

కారు బేక్ డోర్ తెరుచుకుంది. ముందు సేఠ్ చండీ రామ్ దిగేడు. అతని వెనకే మరో వ్యక్తి దిగేడు. సేఠ్ కుడిచేతిలో ఉంది బ్రీఫ్ కేస్. ముదురు నీలిరంగు బ్రీఫ్ కేస్.

స్టేషన్ కూలీలు ఆ కారును చుట్టుముట్టేరు.

“వాడెవడు?” అడిగేడు శివదాస్ సేఠ్ వెంటవున్న వ్యక్తిని కళ్ళతో చూపిస్తూ, భిక్షపతికి.

“సేఠ్ అల్లుడు!”

“కొంపదీసి వాడూ, అతనితో ప్రయాణం చెయ్యడం లేదు కదా?”

“ఏమో?”

అంతలో! ఆ వ్యక్తి, కారు డిక్కీ తెరిచి, ఇద్దరు కూలీలకి సైగ చేసాడు. కూలీలు డిక్కీలోంచి రెండు సూట్ కేస్ లూ, ఓ బెడ్ హోల్డాల్, అందుకుని, నెత్తిన పెట్టుకున్నారు. ఓ కూలీ సేఠ్ చేతిలో వున్న బ్రీఫ్ కేస్ అందుకో బోయాడు.

“ఫరవాలేదు. మీరు వాటిని తీసికెళ్ళండి” అన్నాడు సేఠ్ బ్రీఫ్ కేస్ ని చంకలో అదుముకుంటూ.

దాంతో, భిక్షపతి చెప్పింది నిజమేనని రూఢి అయింది శివదాస్ కు.

సేఠ్, అతని అల్లుడూ కూలీలని అనుసరిస్తూ స్టేషన్లో ప్రవేశించేరు.

శివదాస్ ఓ కూలీని కేకేసి తమ కారు డిక్కీలోవున్న మూడు సూట్ కేస్ లని అతని కప్పగించి, కృపానంద్ కు సైగ చేసాడు, వెళ్ళమన్నట్టు.

మరుక్షణం కారు స్టార్టయి, వెళ్ళిపోయింది.

మిగతా ఇద్దరు సహచరులతో, సేఠ్ వెళ్ళినవైపు అడుగులు వేసాడు శివదాస్. ఆ ముగ్గురి మస్తిష్కాల్లో ఒకే ఒక్క విషయం సమ్మెటలా మోగుతోంది!

ఇరవై లక్షలు!!

ఎనిమిదో నెంబర్ ప్లాట్ ఫాంలో, ఆలోగా రెడీగా వుండవలసిన త్రివేంద్రం ఎక్స్ప్రెస్ ఇంకా రాలేదు. బిక్షపతి ఎంక్వైరీలో కెళ్ళి కనుక్కున్నాడు. గంట లేటని తెలిసింది!

సేఠ్ చండీరామ్, అతని అల్లుడూ ప్లాట్ ఫాంమీద నిల్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. బ్రీఫ్ కేస్ ఇంకా సేఠ్ చంకలోనే వుంది.

తొమ్మిది గంటలకి వచ్చింది బండి.

కూలీలు సేఠ్ సామానెత్తుకుని, ఫస్ట్ క్లాస్ బోగీవైపు పరుగుతీసారు.

సేఠ్, అతని అల్లుడూ వాళ్ళ ననుసరించారు. బిక్షపతీ, కాంతినాథ్, శివదాస్ తమతమ సూట్ కేస్ లందుకుని అటు నడిచారు.

చండీరామ్ వాళ్ళు ఏ కేబిన్ లో దూరతారో ముందు గమనించి, సరిగ్గా అదే కేబిన్ లో ప్రవేశించేరు. సేఠ్ అల్లుడు బెడ్ హోల్డాల్ లోంచి ఓ దిండు తీసి, కింది బెర్త్ మూల, సేఠ్ కూర్చోడాని కనుకూలంగా అమర్చేడు. చండీరామ్ ఆ దిండుకు వీపానించి కూలబడ్డాడు సీట్లో. కూర్చుంటూ చంకలో వున్న బ్రీఫ్ కేస్ ని వీపు వెనక పెట్టుకున్నాడు.

శివదాస్, బిక్షపతీ, కాంతినాథ్ మిగతా మూడు సీట్లాక్రమించారు. ఆ మామా అల్లుళ్ళు ఏదో చర్చించు

కుంటున్నారు మార్వాడీ భాషలో.

గార్డ్ విజిల్ వినిపించింది. సేఠ్ అల్లుడు లేచాడు. మామకు నమస్కరించి కేబిన్‌లోంచి బైటికి నడిచాడు. తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు శివదాస్! సేఠ్ ఒక్కడే ప్రయాణం చేస్తున్నాడన్నమాట.

బండి కదిలింది!

సేఠ్ కిటికీలోంచి చెయ్యి ఊపుతున్నాడు, అల్లుణ్ణి చూస్తూ.

శివదాస్ రిస్టువాచీ చూసుకున్నాడు. తొమ్మిదిన్నర!

ఈ పాటికి కృపానంద్, కార్లో ఆ బ్రిడ్జిని సమీపించి వుంటాడు. ఇక్కణ్ణించి ఇరవైమైళ్ళ దూరంలో వుంది బ్రిడ్జి. మధ్యలో ఓ స్టేషన్ వస్తుంది. కనీసం గంటైనా పడుతుంది, ట్రైన్ బ్రిడ్జి చేరడానికి.

శివదాస్ ఆలోచనలు మరోవిధంగా పరుగులు తీస్తున్నాయి. సేఠ్ ఎంత త్వరగా కునుకుతీస్తే అంత మంచిది. అప్పుడే, బ్రీఫ్‌కేస్ కాజెయ్యడానికి వీలౌతుంది!

ఆలోచనలు కట్టిపెట్టి, ఫార్మాలిటీకోసం సేఠ్‌ని పలకరించాడు శివదాస్. ప్రయాణీకులు మామూలుగా తోటి ప్రయాణీకుల్ని వేసే సామాన్యమైన ప్రశ్నలవి. దాంతో చండీరామ్ చాలా రిజర్వ్‌డ్ నేచర్ కలవాడని స్పష్టమైంది. శివదాస్ ప్రశ్నలకతను చాలా పొడిగా, అయిష్టంగా బదులిచ్చి ఊరుకున్నాడు.

దాంతో, శివదాస్‌కు ప్రసంగాన్ని పొడిగించే ధైర్యం చాల్లేదు. సేఠ్ ఓ గుజరాతీ మాసపత్రిక తీసి చదవడంలో లీనమయ్యేడు. అతనిప్పుడప్పుడే నిదరపోడని రూఢి అయింది శివదాస్‌కు. అసహనంగా తన అనుచరులవైపు చూసాడు.

భిక్షపతి ఏదో ఒక చర్య తీసుకోన్నట్టు కన్ను గీటాడు.

శివదాస్, కుడిచెయ్యి నోటి దగ్గరికి తీసికెళ్ళి గట్టిగా ఆవులించాడు. పుస్తకం చదువుతున్న సేఠ్ తలెత్తి ఓ క్షణం అతనివైపు చూసి, తిరిగి కళ్ళు దించుకున్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మి సార్! పగలంతా పనుల ఒత్తిడితో బాగా అలసిపోయాం! నిదర ముంచుకొస్తోంది. లైట్ వెలుగుతుంటే, ఓ పట్టాన నిదరపట్టదు నాకు" నసిగాడు శివదాస్.

"అలాగా! మాకీ తెలీదు. టైం పాస్ చెయ్యడానికీ మేం ఈ పుస్తకం చదువుతున్నామ్! కోయి బాత్ నై. లైట్ ఆఫ్ చెయ్యండి" అన్నాడు సేఠ్ పత్రిక మూస్తూ.

శివదాస్ లేచి, వెలుగుతున్న లైటార్పి, నీలంరంగు జీరోవాట్ వెలిగించేడు. కేబిన్‌లో మసక చీకటి! కాంతినాథ్, భిక్షపతికూడా నిద్ర నటించసాగారు.

శివదాస్ బెర్త్ మీద వాలుతూ, "మీరు పడుకోరా సేఠ్ జీ?" అడిగేడు.

"నాకీ ప్రయాణంలో నిద్రా పట్టదు. ఇట్లాగే కూర్చుంటామ్!" అన్నాడు సేఠ్ వీపు దిండుకానిస్తూ'

3

బండి ఓ స్టేషన్లో ఆగింది!

శివదాస్ చటుక్కున లేచి, కేబిన్ తలుపు తెరుచుకుని ప్లేట్‌ఫాం మీదికి వచ్చాడు.

"సిగరెట్ పట్టుకొస్తాను" అంటూ భిక్షపతికూడా అతని వెనకే ఇవతలికి వచ్చాడు.

"వెధవ, ప్రయాణంలో నిదరపోడుట! వాడి చచ్చు

అలవాటు నా ప్లానంతా పాడుచేసేలా వుంది.''

''బండి ఈ స్టేషన్ వదిలేక పదిమైళ్ళ దూరంలో నే వుంది బ్రిడ్జి. ఇప్పుడేం చేద్దాం?'' అడిగాడు భిక్షుపతి అసహనంగా.

''ఇంకా చేసేదేముంది? పిస్తోళ్ళకి పని కలిగించక తప్పదు.''

గార్డ్ విజిల్ ఊదాడు!

ఇద్దరూ తిరిగి కేబిన్‌లో ప్రవేశించి తలుపు మూసి, తమ తమ బెర్తుల్లో కూలబడ్డారు. సేఠ్ ఇంకా అలాగే కూర్చున్నాడు. అతని వాలకంలో ఏమాత్రం నిదురమత్తు కనిపించడంలేదు. పగలంతా పడుకునుంటాడు ప్రయాణం వుందని.

బండి కదిలింది.

ప్లేట్‌ఫాం విడిచి స్పీడందుకుంది.

పడుకున్నవాడల్లా చటుక్కున లేచి కూర్చున్నాడు శివదాస్.

సేఠ్ అతనివైపు ఒక్క చూపు సారించాడు. కానీ, నోరు విప్పలేదు.

సిగరెట్ తీస్తున్నట్టు జేబులో చెయ్యి పెట్టాడు శివదాస్. లేచి నిల్చుని, చెయ్యి బైటికి తీసాడు. ఆ చేతిలో మెరుస్తున్న పిస్తోలు చూడగానే సేఠ్ కళ్ళు పెద్దవయ్యాయి.

''బెర్తు మీంచి లేవక! ఏమాత్రం నోరు కదిపినా, పక్షిని కాల్చినట్టు కాల్చిపారేస్తాను'' అన్నాడు శివదాస్ కటువుగా.

''మీ రేదో పెద్దమనుషులనుకున్నా! ఈ దౌర్జన్యం

ఏమిటిది?'' సేఠ్ మొహంలో స్వేదబిందువులు.

''అడ్డదార్లు తొక్కకుండే ఎవ్వరూ పెద్దమనుషులు కాలే రని నీకు తెలుసుగా? ఆ బ్రీఫ్ కేస్ ఇస్తే మేము త్వరలో పెద్దమనుషులమౌతాం, నీవన్నట్టు!'' అన్నాడు శివదాస్ నవ్వుతూ.

''బ్రీఫ్ కేసా? అందులో ఏముందీ?'' సేఠ్ కంఠంలో ఆశ్చర్యం.

''ఏముందో మాకు తెలుసు! త్వరగా దాన్ని బైటికి తియ్!''

''ఇవ్వకుంటే, హేమి చేస్తావ్?''

''చెప్పాగా కుక్కని కాల్చినట్టు కాల్చేస్తానని! రభస చెయ్యకుండా ఇచ్చేవంటే, బ్రతికి బలుసాకు తింటావ్! ఊఁ, త్వరగా తియ్. టైంలేదు.''

సేఠ్ చేతులకి చలనం రాలేదు. అతని దృష్టి ఒక్క క్షణం, పైన వేళాడుతున్న ఎమర్జెన్సీ చెయ్యివైపు వెళ్ళింది. అది గమనించి పకపక నవ్వేడు శివదాస్.

''చేన్ లాగి ట్రేన్ ఆపుదామనుకుంటున్నావా? సరే, అది జరక్కముందే, నీ ఊపిరి నేనాపుతాను!'' అంటూ ట్రిగర్ మీద వేలు బిగించాడు.

''ఆగు! బ్రీఫ్ కేస్ ఇస్తాన్!'' అంటూ వీపు వెనక్కి చెయ్యి పోనిచ్చాడు చండీరామ్.

బైటికి వచ్చిన అతని చేతిలో బ్రీఫ్ కేస్ కు బదులు చిన్న సైజు పిస్తోలుంది.

''శివదాస్! తప్పుకో!'' బిక్షుపతి మెరుపులా శివదాస్ ని తనవైపు లాక్కున్నాడు.

''ఢాం... ఢాం ..'' రెండు పిస్తోళ్ళూ ఒకేసారి గర్జించాయి.

సేఠ్ పిస్తోలుగుండు మిస్ అయింది! శివదాస్ పిస్తోలు గుండు తిన్నగా సేఠ్ కంఠంలో తిష్ఠవేసింది.

ఆతని అరుపు నోట్లోంచి ఇవతలికి రాలేదు. అలాగే ఒరిగిపోయాడు సీట్లోకి. శివదాస్ కు, ఇంకా కసి తీరక, మరో రెండు గుళ్ళు సేఠ్ శరీరంలో దింపాడు. నిజానికి, చండీరామ్ కైలాసం చేరుకున్నది మొదటి గుండుతోనే!

"ఎవ్వరైనా పిస్తోళ్ళ శబ్దం వినలేదుకదా?" అడిగాడు భిక్షపతి.

"నో! అవకాశం లేదు. ఇంత వేగంగా వెళ్ళే ట్రేన్ హోరులో, ఎవ్వరికీ వినిపించదు" అన్నాడు శివదాస్.

భిక్షపతి గబగబ దిండు వెనక దాచివున్న బ్రీఫ్ కేస్ ను అందుకుని, దాని కేచ్ లాగి, తెరవబోయేడు. లాక్ వేసుంది!

సరిగ్గా అదే క్షణంలో, ట్రేన్ స్పీడ్ స్లో అయినట్టు తోచింది.

"బహుశా, బ్రిడ్జిదగ్గిర పడుంటుంది. టైంలేదు. దాన్ని తరవాత తెరిచి చూడొచ్చు" అంటూ ఒక్క అంగలో వెళ్ళి, కిటికీ రెక్క పైకి తోసాడు శివదాస్.

భిక్షపతి బ్రీఫ్ కేస్ తెరిచే ప్రయత్నం విరమించుకుని, కిటికీని సమీపించేడు. శివదాస్ కిటికీలోంచి తలదూర్చి, కళ్ళు చిట్లిస్తూ చీకట్లోకి చూడసాగాడు.

బ్రిడ్జి నిజంగానే సమీపించింది!

దూరాన ఓ కాంతి ఆరుతూ, కనిపిస్తోంది, చీకట్లో చిరు దీపంలా! కృపానంద్ సిగ్నల్ ఇస్తున్నట్టున్నాడు.

భిక్షపతి చేతిలోంచి బ్రీఫ్ కేస్ అందుకున్నాడు శివదాస్ ఊపిరి బిగబట్టి నిల్చున్నాడు. ఆ వెలుగు దగ్గరవగానే, కిటికీలోంచి గిరాటేసాడు, బ్రీఫ్ కేస్ ని బైటకి!

ట్రైన్ ఇప్పుడు బ్రిడ్జిమీంచి పోతోంది. బ్రిడ్జి దాటగానే మళ్ళీ పికప్ అందుకుంది. చేతులు దులుపుకుంటూ వెనక్కి తిరిగాడు శివదాస్. సేఠ్ శరీరంలో ఏర్పడ్డ రంధ్రాల్లోంచి ఇంకా రక్తం కారుతోంది.

"కొద్ది సేపట్లో మనం దిగవలసిన స్టేషన్ రాబోతోంది నువ్వు సేఠ్ జేబులు వెదుకు. వాడి వేళ్ళకున్న ఉంగరాలూ, మెడలో వున్న గొలుసూ తీసుకో. భిక్షుపతీ! నువ్వు సామాను గాలించు" అన్నాడు శివదాస్.

కాంతినాథ్ గబగబ సేఠ్ జేబులు వెదికి, తాళంచెవుల గుత్తీ మనీపర్సు తీసాడు. తాళంచెవులు భిక్షుపతికందించి, పర్సు తెరిచాడు. రెండువేల చిల్లర వున్నాయందులో.

భిక్షుపతి తాళం చెవులతో సూట్ కేస్ తెరిచి, సామాను గాలించాడు. బట్టలు తప్ప మరేం లేవు. అదే సమయంలో, ట్రైన్ పట్టాలు మారుస్తున్న శబ్దం వినిపించింది!

"స్టేషన్ వస్తున్నట్టుంది. ప్లాట్ ఫాం ఏవైపుందో చూడు!" అన్నాడు శివదాస్ భిక్షుపతితో.

అతను కిటికీలోంచి చూసి, "ఎడంవైపుంది!" అన్నాడు.

"వెంటనే కిటికీ షట్టర్స్ దించు. కేబిన్ అవతలికెళ్ళి, ప్లేట్ ఫాంవైపునించి కంపార్ట్ మెంట్లోకి వచ్చే, తలుపు మూసి బోల్ట్ చెయ్."

భిక్షుపతి గబగబ కిటికీ రెక్కలు దించి, కేబిన్ బైటికెళ్ళాడు. రెండు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. ముగ్గురూ తమతమ సూట్ కేస్ లందుకున్నారు.

బండి స్టేషన్లో ఆగింది!

కేబిన్ లోంచి బైటపడి తలుపు మూసారు. ప్లేట్ ఫాం వైపు కాకుండా, రెండో తలుపుగుండా వెనకవైపు దిగారు. అట్నుంచి ఆర్డినరీ కంపార్ట్మెంట్లో ఎక్కి, ప్లేట్ ఫాంమీద అడుగుపెట్టారు!

మామూలు ప్రయాణీకుల్లా అడుగులు వేసుకుంటూ గేట్ వైపు వెళ్ళి, అక్కడ నిల్చున్న టికెట్ కలెక్టర్ కి తమ తమ టికెట్లందించి, అవతల పడ్డారు. స్టేషన్ వెనక రెండు మూడు టాక్సీలు ఆగి వున్నాయి.

అప్పుడు ప్రారంభమైంది ప్లేట్ ఫాంమీద అలజడి!

ఎవ్వరో గొంతు చించుకు అరుస్తున్నారు.

"హత్య! హత్య!!"

"టాక్సీ!" అరిచాడు శివదాస్.

4

ట్రేన్ లోంచి శివదాస్ విసిరిన బ్రీఫ్ కేస్, చీకట్లో కృపానంద్ కు పది గజాల దూరంలో పడింది.

ఎక్స్ప్రెస్ ధనధనలాడుతూ పట్టాలమీద సాగి పోగానే, టార్చి వెలిగించి, మొక్కల్ని తప్పుకుంటూ వెళ్ళి బ్రీఫ్ కేస్ అందుకున్నాడు కృపానంద్.

ఎక్సైట్ మెంట్ తో అతని మనసు ఉరకలు వేస్తోంది, అక్కడికి అరఫర్లాంగు దూరంలో, రోడ్డు పక్కన ఆపి వచ్చిన అంబాసిడర్ కారువైపు చకచక అడుగులు వేసాడు.

పది నిమిషాల్లో చేరుకున్నాడు. ఇంజన్ స్టార్ట్ చేసి, హెడ్ లైట్ వెలిగించాడు. గేర్ లాగి, కారు ముందుకు పోనిచ్చాడు.

ఆగి ఆగి అతని మస్తిష్కంలో పక్కనున్న బ్రీఫ్

కేస్ ప్రత్యక్షమాలోంది. ఇరవై లక్షలు!

ఈ క్షణంలో అంత మొత్తం యావత్తూ తన పక్క నుంది. అంత పెద్ద మొత్తం నిజంగా ఆ బ్రీఫ్ కేస్ లో వుందా? ఒక్కసారి దాన్ని తెరిచి, కళ్ళారా చూడాలనే కాంక్ష ఉత్పన్నమైంది అతని మనసులో.

మరుక్షణం కారు వేగాన్ని తగ్గించి, పడివైపు తిప్పి. రోడ్డు దింపేడు. ఇంజన్, హెడ్ లైట్ ఆఫ్ చేసాడు. లోపల టాప్ లైట్ వెలిగించి, బ్రీఫ్ కేస్ ని ఒళ్ళో పెట్టుకున్నాడు. కేచ్ లాగి తెరవబోయాడు. లాక్ వేసుందని తెలిసిపోయింది.

కారు డేష్ బోర్డ్ మూతలాగి, అందులోంచి ఓ స్టీల్ వైర్ తీసాడు. దాన్ని బ్రీఫ్ కేస్ కీ హోల్లో దూర్చి, తిప్పడం ప్రారంభించాడు.

ఐదునిమిషాల తరవాత, "క్లిక్" మంటూ తెరుచుకుంది లాక్.

వణికే చేతుల్తో బ్రీఫ్ కేస్ తెరిచాడు. కృపానంద్ కళ్లు జిగేల్ మన్నాయి. ఇరవై లక్షలు!

బిక్షపతి ఇన్ఫర్ మేషన్ తప్పలేదు... బ్రీఫ్ కేస్ మూస్తూ నిట్టూర్చాడు కృపానంద్. కొన్ని గంటల తరవాత, ఈ ఇరవైలక్షల సంపత్తి నాలుగుభాగాలుగా విభజింపబడు తుంది...

ఇంత మొత్తం ఒకేసారి తన స్వంతమైతే?

సుడిగుండంలాంటి ఈ జీవితానికి శాశ్వతంగా తిలో దకాలిచ్చి, ఏ మారుమూలకో ఎగిరిపోయి, నిక్షేపంగా బ్రతకవచ్చు!

బ్రీఫ్ కేస్ మూతబిగించి, వైర్ తో తిరిగి యధాతధంగా

లాక్ వేసేడు.

దాన్ని నిర్లక్ష్యంగా పక్కకి నెట్టి, కారు స్టార్ట్ చేసాడు. రివర్స్ గేర్‌లో రోడ్ మీదికి తెచ్చి, ముందుకు పోనిచ్చాడు. కారు బాణంలా దూసుకుపోతోంది, మద్రాసు వైపు.

అతని మస్తిష్కంలో, రంగు రంగుల సుందర హర్మ్యాలూ, పథకాలూ ప్రత్యక్షమై, మిగతా ముగ్గురి ముఖాలు జ్ఞాపకం రావడంతో నేలమట్టమవుతున్నాయి.

వాళ్ళు తనని సజీవంగా వదలి పెడతారా?

మద్రాసునగరం దగ్గరపడుతున్నట్లు దూరాన లైట్ల తోరణాలు కనబడసాగాయి. మరో అరగంట తరవాత, కారు నగరంలో ప్రవేశించింది.

రిస్టువాచీ చూసుకున్నాడు. పన్నెండుగంటలు! రోడ్లు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి.ఆ నలుగురూ కలిసి, కార్యకలాపాలు సాగించే ఇల్లు మాంబళంలో ఉంది. శివ దాస్ నివాసంకూడా అదే!

రోడ్డుమీద ట్రాఫిక్ లేదని, కారు స్పీడ్ తగ్గించలేదు కృపానంద్. ఫుల్ స్పీడ్‌లో తోలుతున్నాడు. ఎదురుగా ఉన్న మలుపు తిరిగితే, మాంబళం వెళ్ళవచ్చు. మలుపు రాగానే అదే స్పీడులో స్టీరింగ్ తిప్పాడు. అంతే!

అప్పుడే, రోడ్డు దాటుతున్న వ్యక్తిని గమనించలే దతను. కారు మలుపు తిరగ్గానే అతన్ని గుద్దేసింది! చెట్టంత ఆ మనిషి అమాంతం ఎగిరి ఆమడదూరంలో పడ్డాడు.

క్షణాలమీద గేర్ డౌన్ చేసి, సడన్ బ్రేక్ వత్తేడు కృపానంద్. క్రీచుమనే చప్పుడుతో ఆగిపోయింది కారు.

విండోలోంచి తల బైటపెట్టి వెనక్కి చూసాడు. ఆ వ్యక్తి రోడ్డుమీద గిలగిల తన్నుకుంటున్నాడు.

కృపానంద్ డోర్ తెరిచి, కారుదిగి, ఆ వ్యక్తివైపు పరిగెత్తాడు. నెప్పికి గిల గిల తన్నుకుంటున్నాడతను.

ఇంకా నయం! చావలేదు కింద కూర్చుని పరిశీలించాడు.

అతని కుడికాలి ఎముక విరిగింది!

"క్షమించు...తప్పు నాదే! హాస్పిటల్ తీసికెళ్ళి ట్రీట్ మెంట్ ఇప్పిస్తాను, పద!" అంటూ అతన్ని రెండు చేతుల్లో ఎత్తుకుని, కారుదగ్గరికి తీసికెళ్ళాడు.

బాక్ డోర్ తెరిచి, అతన్ని సీట్లో పడుకోబెట్టాడు. బాధవల్ల ఆ వ్యక్తి నోరు పెగలడంలేదు. కృపానంద్ డ్రైవింగ్ సీట్లో కూర్చుని, స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు.

పావుగంటలో ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంముందు ఆపి దిగాడు.

"పడుకో, అలాగే! ఇప్పుడే వస్తాను" అంటూ గబగబ నర్సింగ్ హోంలో దూరాడు కృపానంద్.

డ్యూటీలో ఉన్న కంపౌండర్ కి పరిస్థితి వివరించాడు. మరుక్షణం, ఇద్దరు వార్డుబోయ్‌లు స్ట్రెచ్చర్ తీసుకెళ్ళి, గాయపడ్డ వ్యక్తిని లోనికి మోసుకొచ్చారు.

గంట తరువాత, ఆ వ్యక్తి తిరిగి కార్లోకి చేర్చబడ్డాడు ఇప్పుడతని కుడికాలి తొడవరకూ ప్లాస్టర్ వేసుంది. మనిషి కాస్త కోలుకున్నట్లు కనిపిస్తున్నాడు.

కృపానంద్ కంపౌండర్ కు బిల్ పైకం చెల్లించి, కారు ముందుకు పోనిచ్చాడు. ఈసారి చాలా స్లోగా

నడుపుతున్నాడు.

డ్రైవ్ చేస్తూ, "నీ పేరేమిటి?" అడిగాడు ఆ వ్యక్తిని.

"శంకరన్!"

"ఇంత రాత్రి ఎక్కడికి బైలుదేరావ్?"

"నేను గ్లాస్ ఫ్యాక్టరీ లేబర్ని. పన్నెండుగంటల షిఫ్ట్ పూర్తిచేసుకుని, ఇంటికెళ్తున్నాను..."

"భార్యా పిల్లలూ వున్నారా?"

"ఉన్నారు! ఇద్దరు పిల్లలు!"

"జీతం ఎంత?"

"మూడొందలు...ఇంకెక్కడిజీతం? కాలు బాగయ్యే వరకూ పనికి పోలేను. ఈ ఏక్సిడెంట్ ఫ్యాక్టరీలోనే అయుంటే, నష్టపరిహారం దొరికేది...నా పిల్లల కడుపు కొట్టారు మీరు!"

"భయపడక! నీవు కోలుకోడానికి రెండు నెలలు పట్టొచ్చు. జీతం మూడొందలన్నావ్ కదూ? వెయ్యి రూపాయలిస్తాను. ఈ సంగతి ఎవ్వరికీ చెప్పక!"

"మీ మంచితనమే ఇంతవరకూ నా నోరు నొక్కేసింది. ఏక్సిడెంట్ అయ్యాక, మీరు కారులో పారిపోయే అవకాశం ఉన్నా, పారిపోకుండా, నాకీ ఉపకారం చేసారు...పైగా డబ్బిస్తానంటున్నారు. అంతకన్నా ఏం కావాలి నాకు?"

"గుడ్! నీ ఇంటి ఎడ్రెస్ చెప్పు, డ్రాప్ చేస్తాను."

శంకరన్ చెప్పాడు.

పావుగంటలో అతను చెప్పిన ఇంటిముందు కారాపాడు కృపానంద్. జేబులోంచి పర్సుతీసి, పది వందరూపాయలు

లెక్క పెట్టి శంకరన్ కండించాడు.

"జాగ్రత్త! నీ కాలి ప్లాస్టర్ కట్ చేసే తేదీ, ప్లాస్టర్ మీద వేసుంది. సరిగ్గా ఆ తేదీన నేను వచ్చి, నిన్ను హాస్పిటల్ తీసికెళ్ళి, ప్లాస్టర్ తీయిస్తాను" చెప్పి, కృపానంద్ అతన్ని జాగ్రత్తగా యింట్లో వదిలి, తిరిగి కారెక్కాడు.

అరగంటసేపు ఎక్కడెక్కడో తిరిగి మాంబళంలో ఉన్న శివదాస్ ఇల్లు చేరుకున్నాడు.

ఇంటికి తాళం వేసుంది. దాని తాలూకు తాళంచెవి ఒక్కొక్కటి ఆ నలుగురి దగ్గిరా వుంటుంది.

కారు గేరేజ్‌లో ఆపి, సీట్లో ఉన్న బ్రీఫ్ కేస్ అందుకొని, తాళం తెరిచి ఇంట్లో ప్రవేశించేడు. కుర్చీలో కూలబడి, బ్రీఫ్ కేస్‌ని టేబిల్ మీద గిరాటేసాడు. సిగరెట్ అంటించి, మిగతావాళ్ళ రాకకోసం యెదురుచూడసాగాడు.

5

సరిగ్గా తెల్లవారుజాము, మూడుగంటలకి తలుపు తట్టిన చప్పుడయింది. కుర్చీలో జారగిలబడి కునుకుతీస్తున్న కృపానంద్, ఒక్క ఉదుటున లేచి, వెళ్ళి తలుపులు తెరిచాడు.

త్రిమూర్తులు ముగ్గురూ నిల్చున్నారు గుమ్మంలో.

"బ్రీఫ్ కేస్ తెచ్చావా?" అడిగాడు శివదాస్.

"తెచ్చాను."

టేబిల్ మీద బ్రీఫ్ కేస్ చూడగానే, శివదాస్ కళ్ళు తళతళ మెరిశాయి. నలుగురూ టేబిల్ చుట్టూ చేరారు.

శివదాస్ బ్రీఫ్ కేస్ అందుకుని, "నీవు దీన్ని తెరవ

లేదూ?'' అడిగాడు కృపానంద్‌ని.

ఆ ప్రశ్నతో కృపానంద్ గుండె వేగం అందుకుంది. "లేదు!" అన్నాడు పొడిగా.

బిక్షపతి నవ్వి "నీ స్వభావానికి విరుద్ధంగా వుందే ఈ విషయం!" అన్నాడు.

"నేను తెరవడానికి ప్రయత్నించిన మాట నిజమే. కాని, తెరుచుకోలేదు. లాక్ వేసుంది. అందుకే, మీ రాక కోసం కాచుకున్నాను."

శివదాస్ జేబులోంచి సేఫ్ దగ్గర లభించిన తాళం చెవులగుత్తి తీసి, ప్రయత్నించసాగాడు. మూడో తాళం చెవి దూర్చి తిప్పగానే, క్లిక్‌మంది లాక్!

అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. వణికే చేతులతో బ్రీఫ్ కేస్ మూత తెరిచాడు శివదాస్.

రెండు టవల్సూ, ఓ సోప్ కేస్, పాకెట్ మిర్రర్, షేవింగ్ బాక్స్, దువ్వెనా, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, టంగ్ క్లీనర్, తప్ప బ్రీఫ్ కేసులో మరేమీ లేవు!

శివదాస్‌కు నమ్మకం కుదరక, ఆ సామానంతా టేబిల్ మీద బోర్లించి, గబగబ వెతకసాగాడు. వాటిలో వజ్రాల జాడ లేదు! ఐనా, ఆశ చావక బ్రీఫ్ కేస్ లోపలి బట్టంతా పీకి, అంగుళం వదలకుండా పరిశీలించాడు.

వజ్రాలు లేవని స్పష్టంగా తేలిపోయింది!

అప్పుడు చూసుకున్నారు నలుగురూ ఒకరి మొహాలొకరు.

శివదాస్ కళ్ళు ఎర్రబడ్డాయి. నిప్పులు కక్కుతూ చూశాడు బిక్షపతిని.

"సేఠ్ ఇరవైలక్షలు విలువచేసే వజ్రాలతో ప్రయాణ

మాతున్నాడని చెప్పావుగా? ఏమైంది? నీ చచ్చు ఇన్ఫర్మేషన్ వల్ల ఓ నిండు ప్రాణి అనవసరంగా బలయ్యాడు. ఫలితంగా మనకు దొరికింది ఈ రెండు టవళ్ళూ, నాలుగు టాయిలెట్ సామాన్లూనా?"

"పడ్డ శ్రమంతా బూడిదపాలయింది!" అన్నాడు కృపానంద్ విచారంగా.

"కాదు! ఇందులో ఏదో మోసం జరిగింది!"

"జరిగిందంతా నీవల్లే! నువ్వూ, నీ ఇన్ఫర్మేషనూ కట్ట కట్టుకు వల్లకాట్లో దూకండి," ముఖం చిట్లించాడు శివదాస్.

"భిక్షుపతి తెచ్చిన ఇన్ఫర్మేషన్స్ ఇదివరకెప్పుడూ తప్పలేదు. నాకూ ఏదో అనుమానం వేస్తోంది!" అన్నాడు కాంతినాథ్.

"సేఠ్ ఇందులో, వజ్రాలు తీసుకు ప్రయాణమయ్యాడని, సెంట్ పర్సెంట్ ఖచ్చితంగా చెప్పగల్ను. లేకుంటే అతను దీన్ని కాపాడుకోడానికి నీమీద పిస్తోలు దేనికి తీస్తాడు? ప్రాణాలు దేనికి పోగొట్టుకుంటాడు? ఈ మాత్రం ఆలోచించలేవా?" అన్నాడు భిక్షుపతి.

అప్పుడు తట్టింది శివదాస్‌కు ఆ ఆలోచన!

ఏదో అర్థమైనట్లు, మెల్లిగా కృపానంద్ వైపు తిరిగాడు. "చెప్పు! బ్రీఫ్ కేస్ తెరిచావ్ కదూ?"

"పిచ్చి పిచ్చిగా మాట్లాడక!"అన్నాడు కృపానంద్ కోపంగా.

"పిచ్చి నాక్కాదు. నీకు పట్టింది. నాలుగేళ్ళనించీ నలుగుర కలిసి కట్టుగా పనిచేస్తున్నాం. దొరికిందంతా

సమానంగా పంచుకుంటున్నాం. ఈరోజు నీకు పిచ్చెక్కబట్టే ఈ పని చేశావ్! గత మూడుగంటలనించీ బ్రీఫ్ కేస్ నీ స్వాధీనంలో ఉంది. నీవు తెరవలేదంటే నే నమ్మను."

"ముందే చెప్పాగా? తెరవడానికి ప్రయత్నించాననీ, తెరుచుకోలేదనీ!"

"కృపానంద్! ఇప్పటికీ మించిపోలేదు. నిజం చెప్పేయ్. నిజం చెప్పావంటే, నిన్ను క్షమించి వదిలేస్తాం!"

"నిజం! నాకేం తెలీదు."

అంతే! శివదాస్ చేతిలోకి పిస్తోలు వచ్చేసింది. "మూర్ఖుడా! మంచి మాటలకి లొంగుతావనుకున్నాను. నీచేత నిజం ఎలా కక్కించాలో నాకు తెలుసు! ఏదీ, ఎడంచెయ్యి అడ్డం చాపు!" అని ఆజ్ఞాపించాడు శివదాస్.

కృపానంద్ గుడ్లప్పగించి చూడసాగా డతన్ని.

"ఊఁ, చెప్పినట్టు చెయ్!" అరిచాడు శివదాస్.

ఏం చేస్తాడో చూద్దామని, ఎడంచెయ్యి అడ్డం చాపేడు కృపానంద్. అంతే!

"ఢాం!' మంది పిస్తోలు.

కృపానంద్ గావుకేక! చాపిన అతని అరచేతి మధ్య గుండ్రని రంధ్రం! ఆ రంధ్రంలోంచి బొటబొట కారుతున్న రక్తం!!

బాధ ఓర్చుకోలేక, కుడిచేత్తో ఆ చెయ్యి అదిమిపట్టుకుని, మోకాళ్ళనడుమ దాచుకున్నాడు.

"ఇది శాంపుల్! ఈ పిస్తోల్లో ఇంకా ఐదుగుళ్ళు

న్నాయి. మిగతా నాలుగు నీ శరీరంలో వివిధచోట్ల దిగబడతాయి. అప్పటికీ నీ నోరు నిజం పలక్కపోతే చివరి గుండు మెదడులోంచి దూసుకుపోతుంది. చెప్పు. వజ్రాలెక్కడ?"

నెప్పివల్ల కృపానంద్ నోరు పెగలడంలేదు.

"అరక్షణంలో నీ నోరు విప్పకుంటే, రెండో గుండు నీ కుడికాలిమధ్య దిగబడుతుంది జాగ్రత్త!" అన్నాడు శివదాస్ ట్రిగ్గర్ మీద వేలుపెడుతూ.

"ఆగు!" అరిచాడు కృపానంద్. "చెబుతాను! నిజం చెపితే నన్ను ప్రాణాలతో వదిలేస్తారా?"

"నేను యిచ్చిన మాట తప్పనని నీకు బాగా తెలుసు!"

"ప్లాజా హోటల్, సేఫ్టీ లాకర్‌లో దాచేను వజ్రాలని!"

"లాకర్ తాళంచెవి ఏది?"

"నా దగ్గరే!"

శివదాస్ చెయ్యి చాపి, "ఇలా ఇవ్!" అన్నాడు.

అంతవరకూ మోకాళ్ళమధ్య అదిమిపెట్టుకున్న చేతులు తీసాడు. కృపానంద్ కుడిచెయ్యి నెమ్మదిగా పాంటు జేబులోకి పోనిచ్చాడు.

బైటికి వచ్చిన అతని చేతిలో తళుక్కుమంది పిస్తోలు! రెప్పపాటు వ్యవధిలో రెండుసార్లు ట్రిగ్గర్ వత్తేడు కృపానంద్. మొదటిగుండు శివదాస్ చేతిలోని పిస్తోల్ను ఎగరగొట్టింది! రెండో గుండు గదిలో వెలుగుతున్న బల్బుని పగలగొట్టింది!!

మరుక్షణం, చీకట్లో, పక్కనేవున్న కిటికీవైపు

గం లేదు కృపానంద్.

"శాంతినాథ్...విశ్వపతీ! పట్టుకోండి వాణ్ణి!" అరిచాడు శివదాస్, చీకట్లో.

6

కిటికీగుండా అవతలికి దూకగానే, బాణంలా కారు గేరేజ్ వైపు పరుగు తీసాడు కృపానంద్. క్షణాలమీద కార్లో కూర్చుని, స్టార్ట్ జేసి, వెనక్కి తీసాడు. గేర్లు మార్చి ముందుకు పరిగెత్తించాడు.

అప్పుడు వినిపించిందతనికి, ఇంట్లోంచి వాళ్ళు పరిగెత్తుకువస్తున్న బూట్సుల శబ్దం!

ఎడంచేతిమధ్య నిప్పుకణం పెట్టినట్టు మంట. నరాలు మెలితిరుగుతున్నట్టు బాధ. ఐనా, కృపానంద్ ఆ బాధని లెక్క చెయ్యకుండా, అరవైమైళ్ళ స్పీడులో కారు తోలుతున్నాడు.

కొన్ని రోడ్స్ కట్ జేశాక, తిరువత్తియూర్ వెళ్ళే జి. టి. రోడ్ మీదికి చేరుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో, చీకట్లు తొలగిపోయి, తెలతెలవారసాగింది.

అనుకోకుండా సైడ్ మిర్రర్‌లోకి చూసి, ఉలిక్కిపడ్డాడు. వెనక ఓ సిమెంట్ కలర్ కారు వస్తోంది! వాళ్ళేనా? ఏ కారో దొంగలించి తనని వెంబడిస్తున్నారా?

ఈ ఆలోచన రాగానే కృపానంద్ కాలు, ఏక్సిలేటర్ని మరింత నొక్కసాగింది. కారు గాలిలో తేలిపోతున్నట్టు దూసుకుపోతోంది. ఇదే స్పీడ్ మేంటినెన్స్ చేస్తే ఏక్సిడెంట్ అయ్యే ప్రమాదముంది.

వాళ్ళు కారేమో! తను ఊరికే ఖంగారుపడుతున్నా

దేమో! ఈ ఆలోచన రాగానే స్పీడ్ కాస్త స్లో చేసాడు. స్పీడ్ తగ్గేసరికి ఆ కారు, నిముష నిముషానికీ దగ్గిరవసాగింది.

ఊహించని విధంగా ఆ కార్లోంచి రెండుసార్లు పిస్తోలు పేలింది.

కృపానంద్ గతుక్కుమన్నాడు. మరుక్షణం అతని కారు వెనుకటి స్పీడందుకుంది. ఆ కార్లో వాళ్ళే వున్నారని దీనితో రూఢి అయిపోయింది.

ప్రాణాలు పోయినా సరే, వాళ్ళకి చిక్కకూడదు. చిక్కడంటే ఎంత క్రూరంగా చంపబడతాడో పానంద్‌కి తెలుసు. అందుకే బాణంలా పరిగెత్తి న్నాడు కారుని.

కొద్దిదూరం వెళ్ళాక, ఎదురుగా రైల్వేక్రాసింగ్ కనిపించింది! అంతేకాదు, ఏదో రైలు వస్తున్నట్లు సంకేతంగా, క్రాసింగ్‌కటూ ఇటూ వున్న ఆటోమేటిక్ బేరియర్స్, కిందికి దిగుతున్నాయి!

కృపానంద్ గుండె దడదడ కొట్టుకోసాగింది. కారు స్పీడ్ మాత్రం తగ్గించలేదు. ఏదైతే అయిందని దూసుకుపోయాడు.

ఆ తెగింపువల్లే, కారు మొదటి బేరియర్ని దాటేసింది. రెండో బేరియర్ పడటానికింకా కొద్ది వ్యవధేవుంది!

శక్తికొద్దీ ఏక్సిలేటర్‌ని వత్తేడు కృపానంద్. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పింది. కారు అవతలికి దూసుకుపోయింది. వెనుక, రెండో బేరియర్ కూడా దిగిపోయింది!

తేలిగ్గా నిట్టూరిస్తూ, సైడ్ మిర్రర్‌లోంచి చూసేడు వెనక్కి.

రైల్వే క్రాసింగ్ బ్లాక్ కావడంతో, వాళ్ళు వస్తున్న ఫియట్ కారు క్రాసింగ్ కవతలి వైపే ఆగిపోయింది!

నవ్వుకుంటూ మిర్రర్ మీంచి దృష్టి తిప్పేడు కృపానంద్. అప్పుడు పడింది అతని దృష్టి, ఎదురుగావున్న బ్లయిండ్ కార్నర్ మీద! గేర్ డౌన్ చెయ్యడానిక్కూడా వ్యవధి లేదు.

అదే క్షణంలో ఆవైపునించి ఓ మోటర్ సైకిల్, మలుపు తిరుగుతోంది. కారు ఆ మోటర్ సైకిల్ని గుద్దుకుంటుందనే ఖంగారుతో, బ్రేక్ వత్తుతూ, స్టీరింగ్ గిర గిరి తిప్పేడు కృపానంద్.

కారు కంట్రోలు తప్పింది. మలుపు కిరుపక్కలా రోడ్డు పక్క నాటివున్న రాళ్ళకి గుద్దుకుని, రెండు గజాలు ఎగిరింది. అలా ఎగురుతూనే కొద్దిదూరం వెళ్ళి, గుంటల్లో పల్టీలుకొట్టింది. అదృష్టవశాత్తూ డోర్ తెరుచుకోవడం వల్ల, కృపానంద్ శరీరం పిల్లిమొగ్గలు వేస్తూ యివతల పడింది!

అతని పక్క టెముకలూ, కాలి ఎముకలూ నజ్జు నజ్జయ్యాయి. మనిషికి స్పృహతప్పలేదు. గట్టిగా ఉఛ్వాస నిశ్వాసలు తీస్తూన్నాడు. కళ్ళల్లో నింగీనేలా కలగాపుల గంగా తిరుగుతున్నాయి. ఇక తను ఎక్కువసేపు బ్రతక డని తెలిసిపోయింద కృపానంద్ కు.

అదేసమయంలో, ఎవరో తనని సమీపిస్తున్న అడుగుల శబ్దం వినిపించి, మెల్లిగా అటు చూసేడు. ఏ వ్యక్తికైనైతే తను రక్షించడానికి, ఇలా ఏక్సిడెంట్ పాలయ్యాడో, ఆ మోటారుసైకిలతనే అతను!

కళ్ళు మూసుకున్నాడు కృపానంద్. ఏ మృత్యువు

నించి తప్పించుకోడానికి తనిలా పలాయనమయ్యాడో, ఆ మృత్యువే యిప్పుడు తనని కబళించబోతోంది!

మనిషి ఈ సత్యాన్ని ఎందుకు గ్రహించడు?

అడుగుల శబ్దం దగ్గరవగానే కళ్ళు తెరిచేడు కృపానంద్.

అతను గబగబ వచ్చి, కృపానంద్ పక్కన కూర్చుని ఏదో అనబోయాడు.

"మాట్లాడక... నేనెక్కువసేపు బ్రతకను... ముగ్గురు హంతకులు నన్ను తరుముకొస్తున్నారు... నా పేరు కృపానంద్... కడపలని స్ట్రీట్ లో... నూటతొంభైఆరవ ఇంట్లో... నా భార్య వుంటోంది... నీవామెకి నా చివరి సందేశం అందజెయ్యాలి..." అన్నాడు కృపానంద్ ఆయాసపడుతూ.

"నన్ను రక్షించబోయి, నీ వీ ప్రమాదాన్ని తెచ్చుకున్నావ్. ఒక విధంగా నేను నీకు ఋణగ్రస్తుణ్ణి! నీ చివరి కోరికె తీర్చి, నా ఋణభారం దింపుకుంటాను. చెప్పు నీ భార్య పేరేమిటి?" అడిగేడతను ఆత్రంగా.

"స్వప్నవేణి!"

"సందేశం ఏమిటి?

"నేనామెకోసం, ఇరవైలక్షలు విలువచేసే నిధిని వదిలిపోతున్నాను... ఈ సంగతి ఆ హంతకులకి, ఎంత మాత్రం తెలియకూడదు..."

"ఆ నిధి ఎక్కడుందో నీ భార్యకి తెలుసా?"

"తెలీదు... మీ నాకీ కాలనీ... ఇరవై నాలుగు నలభై తొమ్మిదో ఇంట్లో ... శంకరన్ అనే... వ్యక్తి... నివసిస్తాడు... అ...క్..." కృపానంద్ కంఠంలో ఏదో అడ్డు పడటంయింది.

అతని పెదాల పక్క నించి రక్తపు చార ఇవతలికి వచ్చింది. బాగా మైకం వస్తున్నట్టు, ఒక్క క్షణం ఆ వ్యక్తివైపు చూసి, తల వాల్చేసేడు.

అతను ఆత్రుతగా, కృపానంద్ తల తనవైపుకు తిప్పుకున్నాడు.

కృపానంద్ మరణించేడు.

పెదవి విరుస్తూ లేచి నిల్చున్నాడతను.

అదే సమయంలో, ఓ సిమెంట్ కలర్ ఫియట్ కారు వచ్చి, రోడ్డుమీద ఆగింది. ముగ్గురు వ్యక్తులు హడావుడిగా కార్లోంచి దిగేరు. ఏదో మంచుకొస్తున్నట్లు గబగబ ఇటే రాసాగేరు.

కృపానంద్ చెప్పిన హంతకులు వాళ్ళే అయుంటారని గ్రహించేడతను.

వాళ్ళతన్ని సమీపించి–"చచ్చేడా?" అడిగేరు ఏక కంఠంతో.

తలూపేడతను.

"చావకముందు నీతో ఏమైనా చెప్పేడా?" అడిగేడు శివదాస్.

"లేదు! నేనతని దగ్గరికి రాకముందే ప్రాణం పోయింది!"

"నీ పేరేమిటి?"

"మణిప్రసాద్."

"ఆల్ రైట్! నీవిక వెళ్ళొచ్చు. శవం సంగతి మేం చూసుకుంటాం!"

మణిప్రసాద్ తలూపి, రోడ్డువైపు నడిచేడు. రోడ్డు మీదికెళ్ళి, వెనుదిరిగి చూసేడు.

ముగ్గురు గబగబ శవం జేబులు వెదుకుతున్నారు.

రోడ్డుపక్క ఆగివున్న తన మోటర్ బైక్ ఎక్కబోతూ అప్పుడు గమనించేడతను. ఆ హంతకులు వచ్చిన ఫియట్ కారుకి కొద్దిదూరంలో మరో కారు ఆగివుంది!

ఆ కారునానుకుని ఫుల్ సూటులో వున్న వ్యక్తి నిల్చున్నాడు.

"ఏదైనా ఏక్సిడెంట్ జరిగిందా అక్కడ?" అడిగేడతను మణిప్రసాద్‌ని.

"ఔను!"

"చచ్చారా, ఎవరైనా?"

"ఔను! ఒక్కడే!"

"మిగతావాళ్ళు ఏంచేస్తున్నారు."

"శవం జేబులు వెదుకుతున్నారు."

"ఎందుకూ?"

భుజాలెగరేసి, మోటర్ బైక్ ఎక్కబోయాడు మణిప్రసాద్.

అతను చిటికేసి—"మాట!" అన్నాడు.

ప్రశ్నార్థకంగా చూసేడు మణిప్రసాద్.

"చచ్చేముందు అతను మీతో ఏమైనా చెప్పేడా?"

ఆ వ్యక్తివేసిన ప్రశ్నలో, మణిప్రసాద్ నోరు తెరుచుకుంది.

ఆ వ్యక్తి పాంటుజేబులో చెయ్యిపెట్టేడు. తిరిగి బైటికి వచ్చిన అతని చేతిలో ఓ విజిటింగ్ కార్డుంది!

దాన్ని మణిప్రసాద్ వైపు చూపేడు.

'డిటెక్టివ్ కృష్ణమూర్తి.

హబీబుల్లా రోడ్,

మద్రాసు-28' అని అచ్చువేసుంది దానిమీద.

"ఇప్పుడైనా మీరు నా ప్రశ్నకి జవాబిస్తారను కుంటాను" అన్నాడతను నవ్వుతూ.

"కృపానంద్ మరణిస్తూ, తన భార్యకి చేరవెయ్యమని ఓ సందేశం వదిలిపోయాడు."

"ఏమిటా సందేశం?"

"ఆమెకోసం ఇరవైలక్షలు విలువచేసే నిధిని నీ చోట భద్రపరిచేడుట!"

"ఎక్కడ?"

"అదే చెప్పబోతుండగా అతని ప్రాణాలు పోయింది..."

"థాంక్స్! మీ పేరు?"

"మణిప్రసాద్!"

"సరే, మీరిక వెళ్ళండి! దార్లో ఓ పెట్రోల్ బంక్ వస్తుంది. అక్కణ్ణించి పోలీసులకు ఫోన్ చెయ్యండి."

మణిప్రసాద్ తలూపి, బైక్ ముందుకి పోనిచ్చేడు.

7

కృపానంద్ ప్రాణం విడుస్తూ చెప్పిన, వడపళని వీధిలోని నూటాతొంభైఆరో ఇంటిముందు మోటర్ బైక్ ఆపేడు మణిప్రసాద్.

ఉదయం పదిగంటలవుతోంది అప్పుడు.

ఇంటి తలుపు మూసుంది. మెట్లెక్కి తలుపు తట్టేడు. నిశ్శబ్దం! మళ్ళీ తట్టేడు.

లోపల ఎవరో తలుపుని సమీపిస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది. అది బూట్స్ల శబ్దం! గడియ తీస్తున్న సవ్వడి. తలుపు తెరుచుకుంది.

ఓ వ్యక్తి సుడిగాలిలా ఇవతలికి వచ్చి, గబగబ వెళ్ళి

పోయాడు. అతన్ని చూడగానే మణిప్రసాద్ నిర్ఘాంత బోయాడు.

అతనెవ్వరో కాదు.

కృపానంద్ శవందగ్గర కనిపించిన ముగ్గురిలో ఒకడు!

గుమ్మందగ్గిర చప్పుడవడంతో తలుపువైపు చూసేడు మణిప్రసాద్.

ఇరవైఎనిమిదేళ్ళుంటాయామెకి. కళ్ళు చెదరగొట్టే అందం! ఎందుకో బెదిరినలేడిలా వుంది వాలకం!।

"స్వప్నవేణిగారున్నారా ఇంట్లో?" అడిగేడు మణిప్రసాద్.

"న్... నేనే స్వప్నవేణిని! మీరెవ్వరు?" ఆమె కంఠంలో కంపన.

"నా పేరు మణిప్రసాద్!"

"మా వారి స్నేహితులా?"!

"కాదు మీకో దుర్వార్త చెప్పడానికి వచ్చాను."

ఆమె నిట్టూర్చింది. "నా భర్త గారు ఏక్సిడెంట్‌లో మరణించాడనే కదూ?"

మణిప్రసాద్ నివ్వెరబోయి, "మీ కెలా తెలిసింది?" అన్నాడు.

"ఇంతక్రితం వచ్చిన వ్యక్తి చెప్పేడు."

"అతను మీకు తెలుసా?"

"తెలుసు! నా భర్తవెంట అప్పుడప్పుడూ వచ్చేవాడు ఇంటికి."

"అతని పేరేమిటి?"

"భిక్షుపతి!"

"మీ భర్త మరణం మీకు విచారాన్ని కలిగించడం లేదా?"

ఆమె వేడినిట్టూర్పు విడిచి, "దేనికి విచారించాలి? అతను చేపట్టిన మార్గం అటువంటిది. ఆ వృత్తిలో ఎవ్వరికీ సహజమైన చావురాదు. మరణశిక్షపడో, పోలీసుల కాల్పులకి గురయ్యో, లేదా ఇటువంటి ఏక్సిడెంట్ పాలు బడో ప్రాణాలు పోగొట్టుకుంటారు" అంది.

"బిక్షపతి ఇక్కడికెందుకొచ్చేడు?"

"ఆయనా, అతనూ, మరో ఇద్దరూ కలిసి, నిన్నరాత్రి ఓ మార్వాడీ దగ్గర ఇరవైలక్షల ఖరీదుచేసే వజ్రాలు దొంగిలించేరుట. మా ఆయన వాళ్ళకళ్ళల్లో కారంకొట్టి వజ్రాలతో పరారయ్యేడుట.

వాటిని ఇక్కడే, ఇంట్లోనే దాచివుంటాడని వెతకడానికి వచ్చేడు. నిజానికి, నేనాయన మొహం చూసి, పది రోజులైంది. అదే చెప్పేను బిక్షపతికి.

ఆయన నమ్మలేదు. పైగా కోపంతో నన్ను నానా మాటలన్నాడు. నా భర్త వాటినెక్కడ దాచేడో నాకు తెలుసుట. ఇప్పుడాయన మరణించేడు గనుక, వాటిని నేనొక్కర్తినే కాజెయ్యడానికి ఎత్తు వేస్తున్నానుట.

అంగుళం వదలకుండా ఇల్లంతా వెతికేడు. ఏమీ దొరక్కపోవడంతో మరీ రెచ్చిపోయి, పిస్తోలు తీసేడు. వజ్రాలెక్కడున్నాయో చెప్పకుంటే కాల్చిపారేస్తానని బెదిరించేడు.

సరిగ్గా అదే సమయంలో మీరు తలుపు తట్టేరు గనుక, నేను బ్రతికిపోయాను..." అంది స్వప్నవేణి.

"కృపానంద్ ఇంటికి వచ్చి పదిరోజులయిందన్నారు కదూ?"

"నేనలా అన్లేదే! ఆయన మొహం చూసి పదిరోజు

అయిందన్నాను! నేనింట్లో లేనిసమయంలో ఆయన వచ్చుండొచ్చుగా.

"నిన్నరాత్రి మీరింట్లో ఉన్నారా?"

"లేను. సెకండ్ షో పిక్చర్ కెళ్ళాను."

"ఐతే, కృపానంద్ వజ్రాలను తప్పకుండా ఇక్కడే దాచుంటాడు."

"బిక్షపతి సూదిమొనంత స్థలం కూడా వదలకుండా వెదికాడే?"

"అతను నీ ఇంటికి కొత్తవాడు. మీకు తెలిసినంత క్షుణ్ణంగా ఈ ఇంటి గురించి అతనికి తెలియదు. ఎక్కడో పాదో పొల్లుపోయి వుంటుంది. మీరు మరోసారి వెతకండి కృపానంద్ వాటిని ఇంట్లో కాకుండా, ఏ హోటల్ లాకర్లోనో దాచే అవకాశం కూడా వుంటుంది. ఆ లాకర్ తాలూకు తాళంచెవి ఇక్కడ దాచినా దాచుంటాడు. ఈ విషయం కూడా గుర్తుంచుకోవాలి."

"ఇంతకీ, మీ గురించి చెప్పేరు కాదు. మా ఆయనతో మీకు ఏమిటి సంబంధం?"

మణిప్రసాద్ చెప్పేడు జరిగిందంతా పూసగుచ్చినట్లు ఆమెకు.

"సమయానికి మీరు రాబట్టి, నేను బిక్షపతి బారినించి బైటపడగలిగాను. ఆ నీచులు ఏ క్షణంలోనైనా మళ్ళీ వచ్చి నన్ను వేధించవచ్చు. మీరు నాకండగా వుండాలి. వజ్రాలు గనుక నాకు దొరికితే, ఏం చెయ్యమంటారు?" అంది స్వప్నవేణి.

మణిప్రసాద్ కంఠం తగ్గించి, "ఇరవై లక్షలంటే మాటలా? జీవితాంతం స్వర్గసుఖాలనుభవించవచ్చు," అన్నాడు భావయుక్తంగా.

"కాంతా, కనకం ఒకేసారి దొరుకుతోంటే, కాదనే వాడెవ్వడు? సాధ్యమైనంత త్వరగా నీవీ ఇల్లు వదిలి, ఏ హోటల్ కైనా బస మార్చు. అక్కడ మనుషుల సంచలనం ఎక్కువ ఉంటుంది. నిన్నో కంట కనిపెడుతూ నేనుండనే వుంటాను."

"ఏ హోటల్ కెళ్ళమంటారు?"

"ప్లాజా!"

స్వప్నవేణి ఏదో అనబోతుండగా టెలిఫోన్ మోగింది.

"హలో...స్వప్నవేణి స్పీకింగ్! ... మీరెవరు?... డిటెక్టివ్ కృష్ణమూర్తిగారా...నాతో ఏమిటి పని?... సరే, రండి...ఇంట్లోనే వుంటాను!" అంటూ రిసీవర్ దించింది స్వప్నవేణి.

ప్రశ్నార్థకంగా చూసాడు మణిప్రసాద్.

"ఎవ్వరో డిటెక్టివ్ కృష్ణమూర్తిట! నాతో అర్జంటుగా మాట్లాడాలిట. ఇప్పుడేను నన్నేం చెయ్యమంటారు?"

"ఏక్సిడెంట్ జరిగినచోట నేనతిన్ని చూసాను. బహుశా, ఆ సందర్భంలోనే నీతో మాట్లాడ్డానికి వస్తున్నట్టున్నాడు. జాగ్రత్త! డిటెక్టివ్‌లు అవులిస్తే పేగులు లెక్కపెట్టే పిండాలు. ఏమీ తెలీనట్టు సమాధానాలిచ్చి పంపు. నేనిక్కడుండటం ప్రమాదం, సాయంత్రానికల్లా నీవు ప్లాజా హోటల్ చేరుకో. నేనక్కడే కలుస్తాను" అంటూ లేచాడు మణిప్రసాద్.

8

సాయంత్రం ఐదు గంటలకి ప్లాజా హోటల్ చేరుకుని స్వప్న వేణి గురించి వాకబ్ చేసాడు మణిప్రసాద్. థర్డ్ ఫ్లోర్లో నూటా ఎనభై రెండో గదిలో దిగిందని తెలిసింది. లిఫ్ట్‌లో పైకెళ్ళి, ఆమె గదిముందాగి, కాలింగ్ బెల్ నొక్కాడు.

నిమిషం తరవాత తలుపు తెరుచుకుంది.

“వచ్చారా? రండి!” అంటూ తలుపు కడ్డం తొలగింది స్వప్న వేణి.

మణిప్రసాద్ సోఫాలో చతికిలబడి, “ఆ డిటెక్టివ్ నిన్ను కలుసుకున్నాడా?” అడిగేడు.

“ఔను.”

“ఏమన్నాడు?”

“వజ్రాల గురించి అడిగాడు!”

“ఏమన్నావ్?”

“నాకేం తెలీదన్నాను.”

“అతను ఎవ్వరికోసం, దేనికోసం ఈ వ్యవహారంలో తలదూరుస్తున్నాడట?”

“హత్య చెయ్యబడ్డ సేఠ్ చండీరామ్ తరఫున!”

“ఇల్లంతా వెతికావా?”

“వేలెడు స్థలంకూడా వదలకుండా వెదికాను. తాళం చెవీ లేదు. వజ్రాలూ లేవు!”

తల విదిలించాడు మణిప్రసాద్. “నాకు నమ్మశక్యం కావడం లేదు. వెతకడంలో నీకల్లకూడా ఏదో ఒక స్థలం మిస్ అయుంటుంది.”

“ఐతే, మళ్ళీ వెదకమంటారా?”

"వద్దు!"

"మరి?"

"నేనే వెళ్ళి వెదుకుతాను. ఇంటితాళం చెవి నాకివ్వు!"

స్వప్న వేణి పలకలేదు. కాసేపు ఆలోచించి, ఏమను కుందో ఏమో, హాండ్ బ్యాగ్ తెరిచి, తాళం చెవులందిం చింది.

"ఇంకో సంగతి! ఉదయం ఆ డిటెక్టివ్ వచ్చి వెళ్ళాక, పోలీసులు వచ్చారు మా ఇంటికి!"

"పోలీసులా? ఎందుకు?" అడిగాడు మణిప్రసాద్ ఆత్రంగా.

"మా ఆయన జేబుల్లో కొన్ని కాగితాలు దొరికేయట. వాటి ఆధారంతో మా ఇల్లు కనుక్కోగలిగారుట. ఆ కాగితాల్లో, అన్నాదురై స్ట్రీట్ లో వున్న ఓ నర్సింగ్ హోం బిల్ కూడా వుందిట. ఆ నర్సింగ్ హోంతో మా ఆయనకేమిటి సంబంధం అని సవాలక్ష ప్రశ్నలు వేసారు. నాకేమీ తెలీదని పంపాను!"

"అలాగా! దాని విషయం నిదానంగా ఆలోచిద్దాం!" అన్నాడు మణిప్రసాద్ లేస్తూ.

9

టాక్సీ ఎక్కి, తిన్నగా స్వప్న వేణి ఇంటికి బయలు దేరాడు మణిప్రసాద్.

ఇంటిముందు టాక్సీదిగి, మీటర్ డబ్బులిచ్చి టాక్సీని పంపేసాడు. హిప్ పాకెట్లోంచి, స్వప్న వేణి ఇచ్చిన తాళం చెవి అందుకుని ఇంటి మెట్లెక్కాడు.

అది డోర్ లాక్ సిస్టమ్ తలుపు. కీ హోల్లో తాళంచెవి దూర్చి తిప్పేడు. తెరుచుకుంది. తలుపు తోసి లోనికెళ్ళిన మణిప్రసాద్ నివ్వెరబోయాడు!

ఎవ్వరో, ఆదివరకే ఇల్లుపీకి పందిరేసారు, సామానంతా చిందరవందరగా పడుంది. సాలోచనగా తలూపుతూ, పడగ్గదిలో ప్రవేశించాడు. మంచంమీది పరుపూ, దిళ్ళూ కోసి, పోగులు పెట్టున్నాయి.

ఓ గోడవారగా, గోద్రెజ్ బీరువా వుంది. దాని సమీపించి, పిడితిప్పి తలుపు తెరిచాడు. అంతే!

మొదలు నరికిన చెట్టులా, దభీమంటూ అతనిమీద పడింది ఓ మానవ శరీరం! మణిప్రసాద్ గుండె గుభిల్లుమంది. పడబోతూ నిలదొక్కుకున్నాడు. అప్పటికే ఆ శరీరం బేలెన్స్ తప్పి కింద పడింది బోర్లా! అతన్ని వెల్లకిలా తిప్పి నిర్ఘాంతపోయాడు మణిప్రసాద్.

అతను ఎవ్వరో కాదు.

కాంతినాథ్!

కళ్ళూ, నాలికా వెళ్ళుకువచ్చి వున్నాయి. ఒంటిమీద ఎటువంటి గాయమూ లేదు. ఎవ్వరో అతన్ని గొంతు నులిపి చంపారు!

అంతలో, ఆవతలి గదితలుపు దగ్గర చిన్నశబ్దమయింది. మణిప్రసాద్ వెంటనే బెడ్రూం తలుపు పక్కన నక్కి అవతలికి తొంగిచూసాడు.

ఎవ్వరో అవతలినించి. మూసివున్న తలుపు_కీ హోల్లో తాళం చెవి దూర్చి తిప్పుతున్నారు. లాక్ తెరుచుకోడం లేదు.

రంధ్రంలోంచి ఆ తాళం చెవి వెనక్కి వెళ్ళింది. నిమిషం తరవాత మరో తాళంచెవి లోనికి దూరింది. అంతకీ లాక్ తెరుచుకోలేదు. అలా నాలుగైదు తాళం చెవులతో ట్రైజరిగాక, ఆరో తాళం చెవితో క్లిక్ మన్న చప్పుడయింది.

నెమ్మదిగా కిర్రుమంటూ తెరుచుకుంటోంది తలుపు!

మణిప్రసాద్ చాటునించి గుమ్మం మధ్యకి వచ్చి నిల్చున్నాడు. తలుపు తోసుకుంటూ లోనికి వచ్చిన వ్యక్తి, మణిప్రసాద్‌ని చూసి ఉలిక్కిపడ్డాడు.

అతను శివదాస్!

"నువ్వా!? కృపానంద్ ఆక్సిడెంట్ అయినచోట కనిపించావ్ కదూ! ఇక్కడేం చేస్తున్నావ్?" అడిగేడు ఆశ్చర్యంగా.

"ఏ లక్ష్యంతో నువ్వు వచ్చేవో, ఆ లక్ష్యంతో నే వచ్చేను. కాని, నా కన్నా ముందే, ఎవడో మహానుభావుడు ఆ పని కాస్తాపూర్తి చేసుకెళ్ళాడు."

"అంటే వజ్రాలు పట్టుకెళ్ళాడు?"

"ఏమో!"

సాలోచనగా తలూపుతూ పడగ్గదివైపు దారితీసేడు శివదాస్.

మణిప్రసాద్ క్షణంలో తలుపుదగ్గరికి చేరుకున్నాడు. అతనింకా తలుపు తెరవకముందే, "ఆగు!" అన్న కేక వినిపించింది.

ఊపిరి బిగపట్టి వెనుదిరిగేడు.

శివదాస్ చేతిలో పిస్తోలు మెరుస్తోంది! "శాంతినాథ్‌ని ఎవరు చంపారు?"

"అతన్ని నేను చంపలేదు! ఎవ్వరో ముందే చంపేశారు!"

"నోర్ముయ్! నువ్వు చంపకుంటే, వాడిశవం లోపలుందని నాకెందుకు చెప్పలేదు?"

"నీ అనుమానానికి కారణం లేకపోలేదు. ఇప్పుడు నా

పొజిషన్ అలా వుందిమరి! నా మాట నమ్ము.''

శివదాస్ పలక లేదు. కాసేపు ఆలోచించి-''హంతకుడు నువ్వో, ఇంకెవడో గానీ, చెప్పు. కృపానంద్ మరణిస్తూ నీతో ఏమన్నాడు?''

''నే నతని దగ్గిర కెళ్ళేలోగా, అతను ప్రాణం వదిలేడు.''

''మణిప్రసాద్! ఈ బోగస్ డైలాగు ఇదివరకే విన్నాను. నీవు నిజం చెప్పడం లేదని నా అనుభవం చెబుతోంది!''

''నీవు నమ్మినా, నమ్మకున్నా నేను చెప్పింది నిజం!''

''నీ జవాబు అదే అయితే, కృపానంద్ వెళ్ళిన చోటికే నిన్నూ పంపక తప్పదు మరి! నిర్ణయించుకో. ఒకేఒక్క నిమిషం టైం ఇస్తున్నాను!'' అన్నాడు శివదాస్ రిస్టువాచీ చూస్తూ.

మణిప్రసాద్ ముఖంలో సన్నసన్నగా స్వేదబిందువులు పేరుకోసాగాయి. రాతిబొమ్మలా చూస్తూ నిల్చుండిపోయాడు.

''నిమిషం పూర్తయింది! అంతేకాదు, నీ ఆయువూ మూడింది'' అంటూ ట్రిగ్గర్ మీద వేలుపెట్టేడు శివదాస్.

''ఆగు! చ్ ... చెబుతాను ... కృపానంద్ మరణిస్తూ, తన భార్యకోసం ఇరవై లక్షల వజ్రాలు వదిలిపోతున్నానని చెప్పేడు.''

''ఇంకా?''

''మీనాక్షి కాలనీలో, ఇరవై నాలుగూ, నలభై తొమ్మిదో నెంబర్ ఇంట్లో వుంటున్న శంకరన్ అనే వ్యక్తి పేరు ఉచ్చరించేడు.''

"ఎందుకు?"

"అదే చెప్పబోతుండగా అతని ప్రాణంపోయింది."

"సరే, ఆ కుర్చీలో కూర్చో!" అంటూ కుర్చీ చూపేడు శివదాస్.

మరబొమ్మలా కుర్చీలో కూలబడ్డాడు మణిప్రసాద్.

గుమ్మానికి వేళ్ళాడుతున్న కర్టెన్ చింపి, అతన్ని సమీపించేడు శివదాస్.

"అదేమిటి!?"

"నిన్ను కట్టిపడేసి, ఆ శంకరన్ ఇంటికెళ్ళొస్తాను. అంతవరకూ నీవిక్కడ బుద్ధిగా కూర్చోవాలి. నీవు చెప్పింది అబద్ధమని తేలిందా, ఇక్కణ్ణించి బైటకెళ్ళేది నీ శవమే!" అంటూ మణిప్రసాద్ చేతులు వెనక్కి విరిచి గట్టిగా బిగగట్టేశాడు శివదాస్.

కాళ్ళుకూడా కుర్చీకాళ్ళకి బిగించి, నోట్లో గుడ్డకుక్కి "వస్తాను" అంటూ తలుపు తెరుచుకుని బైటికెళ్ళాడు.

మరుక్షణం తలుపు మూసుకుంది. అవతల లాక్ వేస్తున్న చప్పుడు. మణిప్రసాద్ గుండెలో గుర్రాలు దౌడు తీస్తున్నాయి. తప్పించుకునే మార్గం ఏదీ కానరావడం లేదు. ఐనా, చేతికట్లు వదులుచేసుకోడానికి శతవిధాలా ప్రయత్నించసాగేడు.

అదే సమయంలో టీపాయ్‌మీద టెలిఫోన్ గణగణ మోగింది! ఉలిక్కిపడి అటుచూసేడు. చాలాసేపు అలాగే మోగి, దానంతటదే ఊరుకుంది ఫోన్!

ఐదు నిమిషాలాగి మళ్ళీ మోగింది!

కాసేపయ్యాక తిరిగి ఊరుకుంది.

అలా రెండు, మూడుసార్లు జరిగేక, మోగడం మానేసింది టెలిఫోన్!

నిస్సహాయంగా దానివైపు చూస్తూ కూర్చున్నాడు మణిప్రసాద్.

అరగంట గడిచింది!

హఠాత్తుగా, ఎవరో తలుపు తట్టిన శబ్దమైంది!

మణిప్రసాద్ మనసు ఉరకలు వేసింది. ఎంత ప్రయత్నించినా అతని నోరు పెగలడంలేదు. మళ్ళీ తలుపు బాదిన చప్పుడు.

చివరి ప్రయత్నంగా, శక్తినంతా కూడదీసుకుని, కుర్చీ సమేతంగా నేలమీద దొర్లేడు మణిప్రసాద్.

పెద్ద చప్పుడయింది!

అవతల తలుపుతట్టడం ఆగిపోయింది. లాక్ తెరవడానికి ప్రయత్నిస్తున్నారు. రెండు నిమిషాల తర్వాత క్లిక్‌మన్న శబ్దం!

కిర్రుమంటూ తెరుచుకుంది తలుపు.

"నువ్వా!?" అన్నాడు మణిప్రసాద్ ఆనందాతిశయంతో.

అతని మిత్రుడు నవ్వి—"మీరిక్కడికి వస్తున్నానని చెప్పేరు కదా, ఇంకా రాలేదేమిటా అని, టెలిఫోన్ డైరెక్టరీలో ఈ ఇంటి ఫోన్ నెంబర్ కనుక్కుని రింగ్ చేసేను. ఎంతకీ జవాబు రాకపోవడంతో, అనుమానం వేసి, పరిగెత్తుకొచ్చేను" అంటూ గబగబ మణిప్రసాద్ కట్లు విప్పేడు.

అతను లేచినిల్చుని—"పద!" అన్నాడు.

"ఎక్కడికి?"

"మీనాక్షి కాలనీ!"

10

మీనాక్షి కాలనీలో, శంకరన్ ఇల్లు కనుక్కోవడం వాళ్ళకట్టే కష్టం కాలేదు. ఇంటితలుపు మూసి ఉంది!

"బహుశా, శివదాస్ యింట్లో ఉండివుంటాడని నా అనుమానం! దేనికైనా మంచిది, నీవు దొడ్డితలుపుగుండా, ఇంట్లో ప్రవేశించడానికి ప్రయత్నించవచ్చు" అన్నాడు మణిప్రసాద్ తన మిత్రుడితో.

అతను తలూపి, ఇంటి వెనకవైపు వెళ్ళాడు.

మణిప్రసాద్ మెట్లెక్కి తలుపు తట్టాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు ఎనిమిదేళ్ళ కుర్రాడు.

"శంకరన్ ఉన్నారా ఇంట్లో?"

"గదిలో ఎవ్వరితోనో మాట్లాడుతున్నారు. తలుపు మూసుంది."

"మీ అమ్మెక్కడ?"

"వంటచేస్తోంది!"

"మీ నాన్నతో అర్జంటు పనుంది. ఏ గదిలోవున్నారో కాస్త మాపెట్టు!" అంటూ యింట్లో ప్రవేశించాడు మణిప్రసాద్.

కుర్రాడు అతన్ని లోనికి తీసుకెళ్ళి, ఓ గది చూపాడు. మూసివున్న తలుపు సందులోంచి లోనికి చూసాడు మణిప్రసాద్.

లోపల నులకమంచంమీద వెల్లికిలా పడున్నాడు శంకరన్. అతని చేతులు మంచానికి విరిచికట్టేసి ఉన్నాయి. అరవకుండా అతని నోటికి టేప్ అంటించి ఉంది!

శివదాస్, అతని కుడికాలి ప్లాస్టర్ని కత్తితో కోస్తున్నాడు. ఐదునిమిషాల్లో, పూర్తిగా కోసేశాడు ప్లాస్టర్ని. అంతే!

మణిప్రసాద్ కళ్ళు ఆశ్చర్యంతో విప్పారేయి.

కట్ చేసిన ప్లాస్టర్లోంచి ధగధగ మెరిసే వజ్రాలు బైటపడ్డాయి! కృపానంద్ వాటిని శంకరన్ కాలి ప్లాస్టర్లో దాచాడన్నమాట!

శివదాస్ ఆ వజ్రాలని కాగితంలో పొట్లం కట్టుకుంటూ తలుపువైపు తిరిగాడు. మణిప్రసాద్ తయారుగా నిల్చున్నాడు తలుపుపక్కన.

గడియ తీస్తున్న శబ్దం. తలుపు తెరుచుకుంది. అంతే! ఒక్కతోపు తోసాడు అతన్ని గదిలోకి. ఊహించని ఆ దాడితో బేలెన్స్ తప్పి, నేలకరిచేడు శివదాస్.

మణిప్రసాద్ లోనికి దూరి, మెరుపులా జేబులోంచి పిస్తోలు బైటికి తీసాడు. అతన్ని చూడగానే దిగ్భ్రాంతితో శివదాస్కు మతిపోయింది.

"లే!" అన్నాడు మణిప్రసాద్ పిస్తోలు ఊపుతూ.

నోరు విప్పకుండా, నెమ్మదిగా లేచి నిల్చున్నాడు. సరిగ్గా ఆ దేక్షణంలో, మణిప్రసాద్ వెనక ఏదో చప్పుడై వెనుదిరగబోయాడు.

"కదలక! కాల్చేస్తాను. చేతిలో ఉన్న పిస్తోలు కింద పడెయ్" అన్న కంఠం వినిపించింది.

వెనుదిరిగి చూడకుండానే తెలిసిపోయింది.

అది డిటెక్టివ్ కృష్ణమూర్తి కంఠం!

మారు మాటాడకుండా, పిస్తోలు కింద జారవిడిచాడు.

"ఇద్దరూ చేతులెత్తి గోడవైపు వెళ్ళండి" ఆజ్ఞాపించాడు కృష్ణమూర్తి.

శివదాస్, మణిప్రసాద్ ఇద్దరూ చేతులు తలమీద పెట్టుకుని గోడదగ్గరకెళ్ళి నిల్చున్నారు.

కృష్ణమూర్తి లోనికి వచ్చి, మంచాన్నీ, మంచంమీద పడున్న శంకరాన్నీ, ప్లాస్టర్ ముక్కల్నీ చూసి తలాడించాడు, "ఐతే, వజ్రాలు చేజిక్కించుకున్నారన్న మాట! మీ ఇద్దర్లో ఎవరిదగ్గరున్నాయవి?"

కళ్ళతో శివదాస్ వైపు సైగ జేసాడు మణిప్రసాద్.

"ఏదీ వాటినిలా ఇవ్వు!" అన్నాడు కృష్ణమూర్తి చెయ్యి చాపుతూ.

శివదాస్‌లో ఇంకా చలనం రాకముందే, గుమ్మం దగ్గర అడుగుల చప్పుడై, కృష్ణమూర్తి గిరుక్కున వెనుదిరగబోయాడు.

"కదలకు! వీపు జల్లెడ చేస్తాను! పిస్తోలు కింద పడెయ్" అన్న కంఠం వినిపించింది.

కృష్ణమూర్తి తెగించాడు!

అతనింకా వెనుదిరక్కముందే, "ఢాం!" మంది పిస్తోలు, గుమ్మంలోంచి.

కృష్ణమూర్తి గావుకేక! అతని చేతిలోని పిస్తోలు ఎగిరి కిందపడింది. గదిలో అడుగుపెట్టాడు మణిప్రసాద్ స్నేహితుడు. అతన్ని చూడగానే మణిప్రసాద్ ప్రాణం లేచివచ్చింది.

గోడదగ్గిరినుంచి కదిలి, కృష్ణమూర్తిని సమీపించాడు. అతని చేతిగాయంలోంచి బొటబొట కారుతోంది రక్తం!

"తెగింపు అన్ని సమయాల్లోనూ పనికిరాదు మిస్టర్

నకిలీ డిటెక్టివ్. డిటెక్టివ్ కృష్ణమూర్తిలా నటిస్తూ, వజ్రాలకోసం నానా అవస్థలూ పడ్డావ్... కాంతినాథ్‌ని చంపింది నీవేనని నాకు తెలుసు.

అసలు కృష్ణమూర్తితో నాకు మంచి పరిచయముంది. ఎందుకో తెలుసా? మీరనుకుంటున్నట్టు నేను మణిప్రసాద్‌ని కాను. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిని! ఇతను నా అసిస్టెంట్ సార్జెంట్ డేవిడ్.

ఈ కేసులో మేము అనుకోకుండా, కాకతాళీయంగా ప్రవేశించవలసి వచ్చింది. ఆరోజు, డ్యూటీమీద పారు గూళ్ళో ఇన్వెస్టిగేషన్ చేసివస్తున్న నా మోటార్ బైక్‌ను ప్రమాదంనించి కాపాడాలనే, కృపానంద్ గారు ఏక్సిడంట్ పాలయింది...

ఏది ఏమైనా, ఆ వజ్రాలకోసం మీరంతా, అద్భుతమైన ధైర్యసాహసాలు ప్రదర్శించేరు. ఫలితం మాత్రం మొదటికే వచ్చింది! మీ మరో అనుచరుడు బిక్షపతి, హోటల్లో స్వప్నవేణిపై హత్యాచారం జరుపబోతుంటే ఇంతకుముందే అరెస్టుచేశాము'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి శంకరన్ కట్లు విప్పుతూ.

సార్జెంట్ డేవిడ్ యీలోగా వాళ్ళిద్దరికీ బేడీలువేసి బయటికి నడిచాడు.

—:ఐపోయింది:—